# పెద్దల బుద్ధి ఇంత చిన్నదా?

ఆ చిన్నారి బాబుకు రాజకుమార్ అనే పేరు పెట్టటానికి ప్రత్యేకమైన కారణాలేమైనా కావాలా? 'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నట్లు ఈ తల్లిదండ్రులకు తమ ప్రథమ సంతానమైన ఈ బుడుతడు ఒక రాజకుమారుడే మరి! ఆంగ్లంలో 'టామడిక్ అండ్ హారి' అని చెప్పినట్లు ఈ మాతాపితలు తమ పుత్రరత్నానికి ఎల్లయ్య, పుల్లయ్య అనే మామూలు పేర్లు పెట్టే అవకాశమే లేదు. అసలు ఆ పిల్లవాడు సామాన్యుడేం కాదు, అసామాన్యుడే! పెద్దవాడైన తర్వాత మరింత విశిష్టుడవుతాడు.

రాజకుమార్ అని ఆ అబ్బాయికి పేరు పెట్టటానికి ఒక ప్రత్యేక కారణం గూడా లేకపోలేదు. తల్లి పేరు రజిత, తండ్రి పేరు రవికుమార్ అయినప్పుడు వారిద్దరి సంగమ సంకేతమేగదా రాజకుమార్ అనే ఆ నామధేయం?

రవికుమార్ ఒక ఇంజనీర్. తన స్నేహితులతో కలిసి బాలానగర్‌లో ఒక చిన్న ఇండస్ట్రీని నడుపుతున్నాడు. అతను ప్రస్తుతం ఉంటున్నది అమీర్ పేట్‌లో. రవికుమార్ రజితల వివాహమై ఇప్పటికి నాలుగు సంవత్సరాలైంది. తొలి సంతానం కుమారుడే కలగాలని వాళ్ళిద్దరి కోరిక. మంచి మనసుకు మంచే జరుగుతుందన్నట్లు వాళ్ళ అభీష్టానుసారం వాళ్ళకు ఇష్టపుత్రుడే జన్మించాడు. అతని వయస్సు ఇప్పుడు మూడు సంవత్సరాలు. మరిప్పుడు ఈ లెక్కలన్నీ సవ్యంగానే ఉన్నాయి గదా? అంటే పెండ్లి జరిగి నాలుగు సంవత్సరాలు; మొదటి బిడ్డకు మూడు సంవత్సరాలు... ఈ లెక్కని తలక్రిందులు చేస్తే వినే వాళ్ళకు వినోదంగానే ఉంటుంది గాని, ఆ దంపతులకు మాత్రం ఇబ్బందికరంగా ఉంటుంది. ఏమిటీ! విషయం ఇంకా అవగాహన కాలేదా? వాళ్ళ పెళ్ళి మూడు సంవత్సరాల క్రితమే

జరిగి, మొదటి సంతానానికి నాలుగు సంవత్సరాల వయసు ఉంటే పరిస్థితి అంతా గంద్రగోళమైపోదూ? విదేశాల్లో ఇది విడ్డూరంకాకపోయినా ఇక్కడట్లా జరగటం సమంజసమవుతుందా? భగవంతుడి దయవల్ల వీళ్ళ విషయంలో ఈ విపర్యాయా లేమీ లేవు, లెక్కలన్నీ సవ్యంగానే ఉన్నా, నాలుగు సంవత్సరాల వివాహ కాలంలో మూడు సంవత్సరాల కొడుకును కలిగి ఉన్నారంటే, వాళ్ళు సమయమేమీ వృధా చేయలేదన్న విషయం స్పష్టమవుతుంది.

వాళ్ళ దాంపత్య జీవితం ఎంతో సుఖప్రదంగా, సంతోషదాయకంగా ఉండేది. రవికుమార్ తన అర్ధాంగిని ప్రాణప్రదంగా చూసుకునే వాడు. వాళ్ళది ప్రేమ వివాహం కాకపోవటంవల్ల వివాహానంతర ప్రేమకు ఎటువంటి కాంతిహీనతా కలగలేదు. ప్రేమించి పెళ్ళాడిన యువజంటకు వివాహానంతర కాలంలో తమ పరస్పర ప్రేమల మధ్య ఎంతో కొంత మసకతనం రాలేదా అన్న సందేహం కలగడం నేడు సర్వసాధారణం. ప్రేమ గుడ్డిది అన్నసామెత తెల్సినా తెలియకపోయినా వివాహానికి ముందు ప్రేమికులు పరస్పరం దర్శించేది ఆకట్టుకొనే అందాలు, ఆకర్షించే గుణగణాలు మాత్రమే. పెండ్లి అయ్యేవరకు తన ప్రియురాలి స్వేద బిందువులు సుగంధ బంధురమనీ, ఆమె స్వరం కోకిల స్వరమనీ, ఆమె ఛాయ పసిడి వర్ణమనీ సౌశీల్యంలో ఆమె సతీ సుమతి వంటిదనీ ప్రతి ప్రణయ బాధితుడూ ఊహిస్తూనే ఉంటాడు. అదేవిధంగా ఆ ప్రియురాలికి గూడా తన ప్రియుని స్ఫురద్రూపం, మరియు సద్గుణాలు మాత్రమే గోచరమవుతాయి. వివాహమైన కొద్దికాలానికే మానవ స్వేదానికి పారిస్ సుగంధ తైలాలతో ఎటువంటి బంధం లేదనీ, ఏమనిషి చెమటకైనా 'సు' కాని గంధం ఉంటుందని ఏ జంటకైనా తెల్సిపోతుంది. తాను అనుకొన్నంతగా తన భార్య అన్ని సల్లక్షణాలతో కూడిన అప్సరస కాదనీ, తన భర్త ఎటువంటి బలహీనతలూ లేని పురుషోత్తముడూ కాడనీ తన పరిణామ సిద్ధాంతంలో డార్విన్‌కు సైతం అంతుపట్టని అంశాన్ని ఈ నవ దంపతులు త్వరలోనే అవగాహన చేసుకో గల్గుతారు. మన కథలోని నాయికా నాయకులు పరస్పరం ఇటువంటి ఊహాతీత అంచనాలకు అవకాశమేలేని, పెద్దలు నిర్ణయించిన వివాహమే చేసుకొన్నందువల్ల ఎటువంటి అపోహలు పుట్టలేదు, పుట్టిందల్లా ఒక చక్కని బిడ్డ మాత్రమే.

రాజకుమార్ చురుకైన పిల్లవాడు. ఆ కుర్రవాని వయసిప్పుడు మూడు సంవత్సరాలే. అయినా తల్లి తీసుకొన్న ప్రత్యేక శ్రద్ధ కారణలుగా అతను 'ఒన్' నుండి 'టెన్' వరకూ లెక్కించగలడు. 'సన్‌డే' నుండి 'సాటర్‌డే' వరకు క్రమం తప్పకుండా చెప్పగలడు. పెద్దగా తప్పులు దొర్లకుండా 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్', 'బాబా బాబా బ్లాక్ షీప్, హావ్‌యు ఎనీ ఊల్', 'ఆర్ యూ స్లీపింగ్, ఆర్ యు స్లీపింగ్', 'రో రో రోయువర్ బోట్', అనే

నర్సరీ గేయాన్ని ముద్దముద్దుగా వినిపించగలడు.

నర్సరీ విజ్ఞానాన్ని ఇంత అధికంగా సంపాదించిన ఆ చిన్నారి బాలుడు బేగంపేటలోని నర్సరీ స్కూల్‌లో అడ్మిషన్ ఇవ్వటానికి మేనేజ్‌మెంట్ ఎంతో సంతోషంతో సమ్మతిని తెల్పింది. క్లాస్ లీడర్‌గా కావటానికి మరో అబ్బాయితో పోటీపడే అవసరమే ఈ కుర్రవానికి కలగలేదు. ఈ కుర్రవాడు చేసే కొన్ని చిలిపి చేష్టలకు పంతులమ్మలు ఎంతో మురిసెంగా నవ్వుకొనే వారు, వారు రాజకుమార్‌ను ఒక రాజ కుమారునిగానే చూసే వారు. అందరి ప్రేమను చూరగొనటానికి రాజకుమార్‌కు పెద్ద సమయం అవసరం లేకపోయింది.

రోజూ ఉదయం రాజకుమార్‌ను తన స్కూటర్‌మీద స్కూలుకు తీసుకు వెళ్ళేవాడు రవికుమార్, సాయంత్రం పూట రజిత తన ముద్దుల బిడ్డను ఆటోలో ఇంటికి తీసుకు వెళ్ళేది. సంధ్యా సమయాల్లో ఈ దంపతులు ఏ స్నేహితుల ఇంటికో, మరేదైనా విందు వినోదాలకో వెళ్ళే సందర్భాల్లో తప్పకుండా తమ బంగారు కుమారుణ్ణి గూడా తీసుకు వెళ్ళేవారు. అట్లాంటి వేళల్లో ఆ బాలుడు ప్రదర్శించే ప్రతిభా విశేషాలు అందర్నీ ఆశ్చర్యపరచేవి. ఆ కుర్రవాని చేష్టలు చూసి తల్లిదండ్రుల సంబరం రోజు రోజుకూ అధికమయ్యేది.

ఇలా ఉండగా ఒకరోజు తను కోరింది ఇచ్చి తీరాలని తల్లిదండ్రుల ముందు మారాం చేయటం ప్రారంభించాడు రాజకుమార్. తనకు ప్రస్తుతం నీలం తెలుపు రంగులతో ఉన్నదీ, ఒట్టి తెలుపు రంగుతో ఉన్నదీ రెండే జోళ్ళు ఉన్నాయనీ, స్కూల్లో అయిదారుగురు పిల్లలకు ఎర్రరంగు షూస్ ఉన్నాయనీ, తనకూ ఆ ఎరుపు రంగువే కావాలనీ రాజకుమార్ పంతం పట్టాడు.

కొడుకు కోరిక విన్న తల్లి నవ్వాపుకోలేక పోయింది. బాబును చేతుల్లోకి తీసుకొని తనివితీరా ముద్దాడింది.

కానీ తండ్రి ముఖంలో అట్లాంది నవ్వు కన్పించలేదు. కొడుకును ముద్దాడనూలేదు. కొడుకును నిరాశపర్చాలని ఆ తండ్రికి లేకపోయినా, కట్టుదిట్టంగా పిల్లల్ని పెంచకపోతే తర్వాత తర్వాత ఎన్నో సమస్య లొస్తాయన్నది అతని ఆలోచన. తనకున్నది ఒక్కగానొక్క కుమారుడే, ఆబాబంటే తనకెంతో వాత్సల్యానురాగాలున్నాయి. అయినా కళ్యాణ సౌగంధిక పుష్పం కావాలన్న ద్రౌపది కోరిక విన్నంతనే తేవటానికి ముందుకురికిన ఆమె అయిదుగురు భర్తల్లో ఒకడైన భీముడిలా, పుత్రుని విషయంలో తను తొందర పడగూడదు. ఎంతో ప్రేమతో...

''నాన్నా... నీకిప్పుడు రెండు జోళ్ళున్నాయి గదా! ఇవేగాక చెప్పుల జతలూ

రెండున్నాయి. ఆ ఎర్రబూట్లున్న అబ్బాయిలకు నీకున్న నీలం తెలుపు బూట్లు లేవే. నీకున్న షూస్ ఎంతో బాగున్నాయి. ఇవి కొంచెం పాత బడింతర్వాత నీకు ఎర్రవి తప్పకుండా కొనిస్తాను'' అంటూ నచ్చ చెప్పాడు.

ఆ పిల్లవాడు మరి ప్రత్యుత్తరమేమీ ఇవ్వలేదు, మంకుపట్టూ పట్టలేదు, ఏడవనూ లేదు. అయితే ఆ పిల్లవాని ముఖంలో ఏ ఇంత సంతోషచిహ్నమూ కన్పించలేదు. కొద్దిగా కారుమేఘాలు కమ్మిన ఆకాశంలా ఆ బాలుని వదనం మ్లానమైంది. ఏదో ఒక నిర్ణయాని కొచ్చినట్లుగా మెల్లగా తలను పైకీ క్రిందకూ ఆడించాడు.

రెండు రోజుల తర్వాత ఒకనాటి సాయంకాలం రజిత, రవికుమార్‌లు ఒక మిత్రుని ఇంటికివెళ్ళి తిరిగి వచ్చింతర్వాత, స్కూటర్‌పై తల్లివొడిలో కూర్చొని వచ్చిన రాజకుమార్ కాలికి ఉండే తెలుపు నీలం జోళ్ళలో ఒకటి లేదు. జోడీలో ఒకటి పోతే అదింక వాడలేంగదా! మరుసటి రోజునుండీ మిగిలిన ఆ తెల్లబూట్లనే ఆ పిల్లవాడు వాడసాగాడు. మూడ్రోజుల తర్వాత ఒక శనివారం సాయంత్రం బయటకు ఎక్కడికో వెళ్ళి తిరిగి వచ్చింతర్వాత చూస్తే రాజకుమార్ కాలికి ఉన్న ఆ తెల్ల షూస్‌లో కూడా ఒకటి మాయమైంది. ఈసారి ఆ పితా శ్రీకి కొంచెం కోపం వచ్చి కొడుకును కొద్దిగా మందలించాడు. అజాగ్రత్తగా ఉన్నతల్లికి గూడా ఒక డోస్ లభించింది. రాజకుమార్ మాత్రం ఏమీ జరగనట్లే తలక్రిందకు వంచుకుని మౌనంగా కూర్చున్నాడు. మరుసటి రోజు ఆదివారం అయినా, షాపులన్నీ ఆరోజు మూసి ఉన్నా ఎక్కడో ఒకచోట కొనుక్కొన్న ఎర్రబూట్లతోనే రాజకుమార్ ఇంటికి రావటం జరిగింది.

తను ఎంతగానో కలలుగన్న ఆ ఎర్రబూట్లు కొద్దిరోజుల తర్వాత లభించటంతో రాజకుమార్ పట్టరాని ఆనందంతో నాట్యమే చేశాడు. ఆ చిన్నారి ఆనంద తాండవం చూసిన తల్లిదండ్రుల మనసు సంతోషంతో ఉప్పొంగి పోయింది. చిన్న చిన్న విషయాల్లోగూడా ఈపసివాళ్ళు ఎంతగా అలిగిపోతారో! వాళ్ళు కోరుకొన్న ఏ చిన్న వస్తువును పొందినా ఎంతగా సంబర పడిపోతారో! ఏది ఏమైనా ఆ రెండు షూస్ పోవటం ఒకవిధంగా మంచిదే అయిందేమో! ఆ పసివాడు ఆశపడ్డ ఎర్రబూట్లు లభించటం వల్లనే ఇంత ఉల్లాసాన్ని చూడగలిగాం!

ఆ ఆదివారం సాయంత్రమే ఒక మిత్రుని ఇంట్లో డిన్నర్‌కు వాళ్ళు ముగ్గురూ స్కూటర్ మీదవెళ్తున్నారు. ఆ మిత్రుని భార్య పుట్టినరోజు కావటం వల్ల దారిలో ఏదో ఒక బహుమతి తీసుకోవటానికి సాయంత్రం అయిదున్నరకే ఆ దంపతులు ఇంటి నుండి బయలుదేరారు.

స్కూటర్ మీద ఇరవై నిమిషాలు ప్రయాణం చేసిన తర్వాత తల్లివొడిలో కూర్చొని ఉన్న రాజకుమార్ తండ్రి వీపును తట్టి స్కూటర్‌ను వెనక్కి మళ్ళించమని కోరాడు.

ఎందుకని తండ్రి అడిగితే ముసిముసిగా నవ్వుతూ ''ఒక వస్తువును చూపిస్తాను'' అది ముద్దు ముద్దుగా అన్నాడు. ముప్పై అడుగులు వెనక్కి వెళ్ళింతర్వాత స్కూటర్‌ను ఆపమని చెప్పాడు. మెల్లగా కిందకు దిగి, రోడ్డు దిగువన ధూళితో నిండి ఉన్న ఒక పాదరక్షను తీసుకువచ్చాడు రాజకుమార్. ''మమ్మీ... డాడీ... ఇది నా తెల్లషూ గదా!'' అంటూ దాన్ని చూపించాడు. అదే... జారిపోయిందను కొన్న ఆ తెల్ల షూ ఇదే, పైన పేరుకు పోయిన దుమ్మునంతా దులిపి ఆ బూటును స్కూటర్ అరలో భద్రపర్చాడు. మరొక్క అయిదు నిమిషాలు ప్రయాణం చేశారో లేదో ఇటువంటి సంఘటనే తిరిగి సంభవించింది. ఈ తఫా రాజకుమార్‌లో హుషార్ అధికమైనట్లు కన్పించింది. ''డాడీ... మమ్మీ... ఇదేకదా నా బ్లూఅండ్ వైట్ షూ?''

ఆ క్షణాన పుత్రవాత్సల్యంతో రవికుమార్ మనసు పొంగులు వారింది. అప్పటికప్పుడే కొడుకును హృదయానికి హత్తుకొని ముద్దుల వర్షం కురిపించాడు. ఈ విషయంలో తల్లికూడా పోటీ పడింది.

''రజితా... మన అబ్బాయి ఎంత సమర్థుడో చూశావా? నేనింత వేగంగా స్కూటర్ నడుపుతున్నా ఈ దారిలోనే తన షూస్ పోయాయని పసిగట్టి వాటిని వెతికి తీసుకువచ్చాడు. ఎంత మంచి అబ్జర్వేషన్ పవర్! ఎంత సునిశిత జ్ఞాపక శక్తి! మనవాడు అచ్చమైన రాజకుమారుడే, అదీ బుద్ధిమంతుడైన రాజకుమారుడు! అతి సమర్థుడైన రాజకుమారుడు''

భర్త చెప్తున్న విషయాలతో మురిసిపోయిన రజిత కొడుకును మళ్ళీ ముద్దులతో నింపివేసింది. ఆ సమయంలో రాజకుమార్ మనసులోని ఆలోచనేమిటో తెలుసా!

''ఛీ... ఛీ... డాడీ మమ్మీల బుర్ర ఇంత చిన్నదా? ఈ రెండు షూస్‌ను నేను కావాలనే పారవేసిన విషయం వాళ్ళు గ్రహించలేకపోయారు! ఆ పారవేసిన బూట్లను ఇప్పుడు తిరిగి తీసుకు రావటంతోటే నేను గొప్పవాణ్ణైపోయాను, సమర్థుణ్ణి అయిపోయాను. ఎంతో మర్యాదగా ఎర్రషూస్‌కొని ఇవ్వమని కోరితే డాడీ విన్నాడా? ఇప్పుడు చూడండి, ఆ రెండు షూస్ నేను పారవేయగానే, వాటంతటవే ఈ ఎర్రషూస్ వచ్చినై, అందుకే మర్యాదగా అడిగితే ఎవరూ ఏదీ ఇవ్వరు. ఇటువంటి చిన్న చిట్కాలు ప్రయోగిస్తేనే ఈ పెద్దవాళ్ళు దారికి వస్తారు, కానీ విచిత్రం, నేనాడిన ఈ నాటకం వాళ్ళకెందుకు అర్థంకాలేదు? వీపుమీద రెండుదెబ్బలకు బదులుగా నాకు లభించినవి ఈ ముద్దులూ మురిపాలు. నేను పెద్దవాణ్ణైపోయాక ఈమమ్మీ, డాడీల్లాగే నా బుద్ధీ మందగించిపోతుందేమో!''

ఈ ఆలోచనలు రాజకుమార్ మనసులో ఒక అలలాగా వచ్చి వెళ్ళినవెంటనే అతని కళ్ళల్లో చిలిపితనం మెరుపులా మెరిసింది.

(1995 ఆగష్టు ''తెలుగు'' సాహిత్య మాసపత్రికలో ప్రచురించబడినది)